# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 28 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శనివారం 3 అక్టోబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :28 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SAT 3 OCTOBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది

- నెల్లూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు హామీ
- కాలేజీలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

- మిగతా 2లో

## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు

- 34 శాతం రిజర్వేషన్ల జీవో కేవలం రాజకీయ గిమ్మిక్కేనని బొత్స విమర్శ
- చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్
- సుప్రీంకోర్టుకు వెళ్తామనడం బీసీలను మళ్లీ మోసగించడమేనని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపోటు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా,

- మిగతా 2లో

## పరిశుభ్రత సామాజిక బాధ్యత..
# స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర

- నెలకు ఒక రోజైనా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపు
- పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, అది సామాజిక బాధ్యత అని స్పష్టీకరణ
- చెత్తను సంపదగా మార్చే కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా, గోదావరి నదులు కలుషితమయ్యాయని విమర్శ
- రాష్ట్రంలో వర్షపాత లోటుకు పారిశుద్ధ్య లోపాలు కూడా ఓ కారణమని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ నెలకు ఒక్క రోజైనా తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో జరిగిన "స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనని అన్నారు. కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం చెత్తను ఒక సమస్యగా కాకుండా, సంపదగా చూస్తోందని, చెత్త నుంచి సంపద సృష్టించే

- మిగతా 2లో



# కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది

- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య

**కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.**

**పెన్ పవర్ డెస్క్:**ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని

- మిగతా 2లో



### మీరు మా ఏపీ ముద్దుబిడ్డ"..
### అనంత్ అంబానీని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న చంద్రబాబు

- నన్ను ఏపీ బిడ్డగా చూడాలంటూ అనంత్ అంబానీ భావోద్వేగ ప్రసంగం
- ఎమోషనల్ గా స్పందించిన చంద్రబాబు
- కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి నిర్మల, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ భాగస్వామ్యం కావాలని సీఎం ఆకాంక్ష



## ఉచ్చు బిగిస్తున్న ఈడీ..
### వివేకా హత్య కేసులో కీలక పరిణామం

- వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డికి ఈడీ నోటీసులు
- ఈ నెల 14న విచారణకు హాజరుకావాలని స్పష్టీకరణ
- రూ.40 కోట్ల డీల్‌పై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు
- గతంలో అవినాష్ రెడ్డి ఇంట్లో రూ.24 లక్షలు స్వాధీనం చేసుకున్న అధికారులు
- సీబీఐ ఛార్జిషీట్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, మనీలాండరింగ్ కోణంలో

- మిగతా 2లో

### పంజాబ్ సరిహద్దులో ఇద్దరు చొరబాటుదారులు
# హతం



- టార్న్ టారన్ జిల్లాలో చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో కాల్పులు జరిపిన దళాలు

- మిగతా 2లో

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్



**పెన్ పవర్ డెస్క్:**రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న

- మిగతా 2లో



## హనుమాన్ చాలీసా చదివి ధైర్యం తెచ్చుకున్నా..
### మోదీతో వీడియోకాల్‌లో స్మిత్ భావోద్వేగం

**పెన్ పవర్ డెస్క్:** ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ ను ప్రధాని నరేంద్రమోదీ ఫోన్‌లో పరామర్శించారు. యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న మచ్చుర్‌తో మోదీ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన అరోగ్య పరిస్థితి గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాక్‌పిట్‌లో తనకు ఎదురైన విపత్కర పరిస్థితి గురించి మోదీకి కెప్టెన్ స్మిత్

- మిగతా 2లో

## కండక్టర్‌గా సీఎం విజయ్..
### బస్సులో మహిళలకు స్వయంగా టికెట్ల పంపిణీ..

- తమిళనాడులో మహిళల ఉచిత బస్సు పథకం 'వెట్రి పయనం' విస్తరణ
- గాంధీ జయంతి సందర్భంగా పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులకు కూడా వర్తించనున్న ఉచిత ప్రయాణం
- ఈ పథకంతో రోజుకు 84 లక్షల మంది మహిళలకు ప్రయోజనం
- మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ పథకం వర్తింపు

- మిగతా 2లో



## ముంబైలో పోటాపోటీ నిరసనలు..
## సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన

- సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన
- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' గ్రూప్ కౌంటర్ నిరసన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్త వాతావరణం
- సోషల్ మీడియాలోనూ ఇరువర్గాల మద్దతుదారుల మధ్య మాటల యుద్ధం
- భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు

- మిగతా 2లో



## అతడి నిమజ్జనం ఇంకా మిగిలే ఉంది

- జ్ఞానూ 'విసర్జన్' జరగాలన్న ప్రకాశ్ రాజ్
- సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణ
- సీఈసీ వైదొలిగేంత వరకు పోరాడాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:**ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. దేశంలో గణేశుడి నిమజ్జనం పూర్తయిందని, కానీ జ్ఞానూ నిమజ్జనం ఇంకా మిగిలే ఉందని సీఈసీని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఎల్ నినోలో వసంతకాలం

దక్షిణార్ధ గోళంలో వసంతకాలం మొదలైంది. చిలీలోని అటకామా ఎడారి సైతం పూలతో కళకళలాడుతోంది. భూమిపై అత్యంత పొడి ప్రాంతాల్లో ఒకటిగా పేరొందిన ఈ ఎడారిలో ప్రస్తుతం ఎటుచూసినా రంగురంగుల పూలే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఎడారిలోని లక్షలాది విత్తనాలు, మొక్కల దుంపలు మొలకెత్తి పూలు పూశాయి. వాటిలో కొన్ని దశాబ్దాలుగా నేలలోనే నిద్రాణంగా ఉన్నాయి."ఇది అరుదైన అద్భుతం. ఇక్కడ 200కు పైగా మొక్కల జాతులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో పూలు పూసే తీరుతో పోలిస్తే ఈ దృశ్యం పూర్తిగా భిన్నం. అసాధారణమైనది" అని నేషనల్ ఫారెస్ట్ కార్పొరేషన్ (కోనాఫ్) రక్షిత ప్రాంతాల విభాగం అధిపతి జార్జ్ కారబాంటెస్ అసోసియేటెడ్ ప్రెస్‌తో చెప్పారు.పసిఫిక్ మహాసముద్రం, ఆండీస్ పర్వతాల మధ్య అటకామా ఎడారి విస్తరించి ఉంది. చిలీ ఉత్తర తీర ప్రాంతంలో సుమారు 1,600 కిలోమీటర్ల మేర వ్యాపించింది.

**చలికాలం నుంచి...**

చలికాలం నుంచి వసంతకాలంలోకి మారే సమయంలో ఇక్కడ పూలు పూయడం సాధారణమే. అయితే ఈ ఏడాది ఎడారిలోని గోధుమరంగు రాతి దిబ్బలు, ఇసుక మైదానాలు రంగురంగుల అడవి పూలతో నిండిపోయాయి. ఈ ప్రకృతి దృశ్యాన్ని స్థానికులు 'డియెసియెర్టో ఫ్లోరిడో' (పూలతో విరబూసిన ఎడారి) అని పిలుస్తారు."ఎడారి అంటే అంతా గోధుమరంగులోనే ఉంటుందని అనుకునేవాడిని. అదే నా మనసులో ఉన్న ఎడారి చిత్రం. ఇక్కడ భారీగా వర్షాలు కురిశాయని తెలుసు. అందమైన పచ్చదనాన్ని చూస్తానని భావించాను. కానీ ఇక్కడి దృశ్యం అద్భుతంగా ఉంది" అని చిలీలో పుట్టి, ఆస్ట్రేలియాలో జీవితమంతా గడిపిన 51 ఏళ్ల ఫెలిక్స్ బండా చెప్పారు. అటకామా ఎడారిని సందర్శించడం ఇదే తొలిసారి అని తెలిపారు.

**రికార్డు స్థాయి వర్షాలతో రంగుల హరివిల్లు...**

జులై, ఆగస్టు నెలల్లో చిలీలోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. 1950వ దశకంలో వర్షపాతం కొలతలు ప్రారంభించినప్పటి నుంచి కొన్ని ప్రాంతాల్లో ఇంత భారీ వర్షాలు ఎప్పుడూ నమోదు కాలేదు. ప్రపంచ ఉష్ణోగ్రతలు వేగంగా పెరిగేందుకు కారణమయ్యే 'సూపర్ ఎల్‌నినో' వాతావరణ పరిస్థితులు ఈ వర్షాలకు కారణమని శాస్త్ర వేత్తలు చెబుతున్నారు."వర్షపాతం నమోదుచేయడం ప్రారంభించినప్పటి నుంచి చూస్తే.. కొన్ని ప్రాంతాల్లో 160, 180, 190 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పరిమాణం పరంగా ఇవి అత్యధిక గణాంకాలు" అని కోనాఫ్ అటకామా జీవవైవిధ్య పరిరక్షణ విభాగం అధిపతి, జీవశాస్త్రవేత్త సీజర్ పిజారో వివరించారు. ప్రస్తుతం చోటుచేసుకున్న ఈ పరిణామానికి కారణం 'సూపర్ ఎల్‌నినో' అని చెప్పారు.భారీ వర్షాల వల్ల చిలీలోని పలు ప్రాంతాల్లో వరదలు, తీవ్ర నష్టం సంభవించాయి. అయితే ఉత్తర ప్రాంతంలోని అటకామా ఎడారిలో మాత్రం పూలు విరబూసేందుకు ఈ వర్షాలు దోహదపడ్డాయి. ఈ ఏడాది సుమారు 17 వేల చదరపు కిలోమీటర్ల మేర ఎడారి పూలతో నిండిపోయినట్లు అంచనా వేస్తున్నారు. ఇది చిలీలో అత్యధిక జనాభా నివసించే శాంటియాగో మెట్రోపాలిటన్ ప్రాంతానికి దాదాపు సమానం.

**కోనాఫ్ అంచనాల ప్రకారం...**

1997 తర్వాత అత్యంత విస్తృతంగా, తీవ్రస్థాయిలో పూలు విరబూసిన ఏడాదిగా 2026 నిలవనుంది.భారీ వర్షాలతో ఎడారిలోని జీవ పదార్థం క్రియాశీలమైందని పిజారో వివరించారు. దీనిని 'జెర్మ్‌ప్లాసమ్'గా పిలుస్తారు. ఇందులో విత్తనాలు, దుంపలతో పాటు వివిధ అకశేరుకాలు, సరీసృపాల గుడ్లు కూడా ఉంటాయి. తగినంత తేమ లభించడంతో ఇవి తిరిగి జీవక్రియలను ప్రారంభించాయి.ఫలితంగా ఎడారిలో 200కు పైగా మొక్కలు, పూల జాతులు కనిపిస్తున్నాయి. ఎరుపు, పసుపు రంగుల్లో నాన్యుకాస్, ఊదా రంగులో రాక్ పర్స్‌లేన్, తెల్లని సుస్పిరోస్, నారింజ రంగులో టెర్సియోపెలోస్ పూలు ఎడారికి కొత్త అందాన్ని తెచ్చాయి. స్థానికంగా కనిపించే 'గర్రా డె లియోన్' అనే మొక్క కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కొండలు, మైదానాలు, లోయలు పూలతో నిండిపోయాయి."30 నుంచి 40 ఏళ్లుగా పచ్చదనం, పూలు కనిపించని కొండలు, పర్వత ప్రాంతాల్లోనూ ఇప్పుడు పూలు విరబూశాయి. ఎడారిలోని ఈ విత్తనాలు, ఇతర జీవ పదార్థాలు ఎన్నో ఏళ్ల పాటు, ఒక్కోసారి దశాబ్దాల పాటు నిద్రాణంగా ఉండగలవు. ఈ ఏడాది కొండలపై కనిపిస్తున్న దృశ్యాలే అందుకు నిదర్శనం" అని పిజారో చెప్పారు.

**పర్యాటకుల సందడి...**

అటకామా ఎడారిలో పూలు విరబూయడంతో దేశీయ, విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జనసంచారం తక్కువగా ఉండే మారుమూల ప్రాంతాలకు వెళ్లి.. ఎడారి అంతటా విస్తరించిన లక్షలాది పూలను చూసి మురిసిపోతున్నారు. తీర ప్రాంతం నుంచి క్షితిజం వరకు పూలతో నిండిన దృశ్యాలను ఆస్వాదిస్తున్నారు.నవంబరులో ఈ ప్రకృతి దృశ్యం ముగిసేలోగా అటకామా ప్రాంతంలో దాదాపు 3 లక్షల రాత్రి బసలతో కూడిన పర్యటనలు నమోదవుతాయని జాతీయ పర్యాటక సచివాలయం అంచనా వేసింది. దీంతో ఈ సీజన్‌లో 'డియెసియెర్టో ఫ్లోరిడో' ఆ ప్రాంతంలోని ప్రధాన పర్యాటక ఆకర్షణల్లో ఒకటిగా నిలవనుంది.చిలీ మధ్య ప్రాంతంలోని కోల్‌చాగువా లోయలో ఉన్న శాంటా క్రూజ్ పట్టణానికి చెందిన చెఫ్ ఫ్రాంకో మోయా (37), తన ప్రేయసితో కలిసి అటకామా ఎడారిని సందర్శించారు. తన పుట్టినరోజు వేడుకల్లో భాగంగా దాదాపు వెయ్యి కిలోమీటర్లు (620 మైళ్లు) ప్రయాణించి ఎడారిలోని పలు ప్రాంతాలను చుట్టివచ్చారు."ఇంతటి పొడి ప్రాంతంలో పూలు ఎలా పెరుగుతున్నాయో చూడటం ఆశ్చర్యం కలిగించింది. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఈ దృశ్యం నిజంగా నన్ను ఆశ్చర్యపరిచింది" అని ఫ్రాంకో మోయా చెప్పారు.

## హనుమాన్ చాలీసా చదివి ధైర్యం తెచ్చుకున్నా..

- మొదటి పేజి తరువాయి

వివరించారు. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో మీరు చూపించిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. మీరు కోలుకోవాలని యావత్ భారతావని ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు.. ఇతరులను రక్షించడం కోసం తమ సొంత ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం గర్వంగా చెప్పగలదు" అని స్మిత్‌తో మాట్లాడుతూ మోదీ ఆయనను ప్రశంసించారు. మోదీ నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. "మీరు నాకు అత్యంత ఆరాధ్యమైన వ్యక్తి. మీ నుంచి కాల్ రావడం చాలా ప్రత్యేకంగా, గర్వంగా ఉంది. ఇది నేను కలలో కూడా ఊహించని క్షణం. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు నేను హనుమాన్ చాలీసాను పఠిస్తాను. కాక్‌పిట్‌లో ఘర్షణ సమయంలోనూ దాన్నే జపించా. ఆ సమయంలో నేను గాయపడినా దాని గురించి ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలు పోవొద్దనే ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి.. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని అర్థం చేసుకున్నా" అని ప్రధానికి తెలిపారు. అంతకుముందు స్మిత్ కుటుంబసభ్యులతో మోదీ మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ప్రస్తుతం స్మిత్ యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అక్కడి భారత దౌత్యకార్యాలయం వెల్లడించింది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో ఈ దాడి ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కెప్టెన్ స్మిత్‌పై కో-పైలట్ దాడి చేసి ఆయనను తీవ్రంగా గాయపర్చారు. కత్తిపోట్లతో శరీరం నుంచి రక్తం ధారగా కారుతున్నా.. విమానం కూలకుండా చూసి ఎంతోమంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడగలిగారు స్మిత్. దీంతో ఆయనపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన హీరో అని, 9/11 లాంటి మారణహోమాన్ని నివారించారని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కొనియాడారు.

## అతడి నిమజ్జనం ఇంకా మిగిలే ఉంది

- మొదటి పేజి తరువాయి

గాంధీ జయంతి సందర్భంగా సోషల్ మీడియాలో విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనలకు ఆయన మద్దతు పలికారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, కాక్రోచ్ జనతా పార్టీ వంటివి ఢిల్లీ, ముంబైలలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయని.. ఈ శాంతియుత నిరసనల్లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని, సీఈసీ వైదొలిగే వరకు పోరాడాలని ప్రకాశ్ రాజ్ పిలుపునిచ్చారు.
ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఈ సవరణ ప్రక్రియ విషయంలో మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా పలుమార్లు అభ్యంతరాలు తెలిపినట్లు వార్తలు రావడం ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 700 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబైలోనూ భారీగా పోలీసులు మోహరించారు.

# మీరు మా ఏపీ ముద్దుబిడ్డ"..

"అనంత్ అంబానీ... మీరు ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం, ముఖ్యమంత్రి స్వయంగా ఆయన వద్దకు వెళ్లి అభినందించి, ఆప్యాయంగా హత్తుకోవడం సభలో ఉన్నవారిని ఆకట్టుకుంది.
అంతకుముందు, సభలో ప్రసంగించిన అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని, రాష్ట్ర అభివృద్ధికి తాను ఏం చేయాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయన ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన లభించింది. అనంత్ ప్రసంగం ముగియగానే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆయనను అభినందించారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంత్ అంబానీ మాటలపై స్పందించారు. "అనంత్ అంబానీని మన రాష్ట్ర ముద్దుబిడ్డగా భావిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలి" అని వేదికపై నుంచి ప్రకటించారు.మదనపల్లెలో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (+ఎఎ), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (xూూ)కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు.
ఇందులో రూ.40 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వ సహకారంతో, మరో రూ.60 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయం పెంపు, ఆధునిక సాగు విధానాలు, ఎగుమతుల ప్రోత్సాహానికి బాటలు పడతాయని ప్రభుత్వం వివరించింది.
కార్యక్రమం అనంతరం ముఖ్య నేతలు మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది

- మొదటి పేజి తరువాయి

వివరించారు.ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు
ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

## గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ భారత్ - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి ప్రజలందరి సహకారం అవసరమని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈరోజు నెల్లూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించి, ఆధునిక క్రికెట్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారాయణ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా ఒక రోజు కేటాయిస్తున్నారని గుర్తుచేశారు.
ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. "గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించింది. గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే, మేం వాటన్నింటినీ క్లియర్ చేస్తున్నాం" అని ఆరోపించారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. పట్టాల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం పేదలకు శాశ్వత నివాస పత్రాలు అందిస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు.

## ఉచ్చు బిగిస్తున్న ఈడీ.. వివేకా హత్య కేసులో కీలక పరిణామం

- మొదటి పేజి తరువాయి

దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసులో రూ.40 కోట్ల డీల్ జరిగిందనే ఆరోపణలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది.వివేకా హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. 2025 ఆగస్టులో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసింది. హత్య కోసం కుట్రదారులు సమకూర్చాలనుకున్న రూ.40 కోట్లు ఎక్కడి నుంచి తీసుకురావాలనుకున్నారు? అంత పెద్ద మొత్తాన్ని వారికి ఎవరు అందించారు? అనే కోణంలో ఈడీ ఆరా తీస్తోంది. అలాగే, హత్యలో పాల్గొన్న నిందితులకు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.4 కోట్ల నగదు మూలాలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసింది. 2019 నుంచి నిందితులు, అనుమానితుల బ్యాంకు లావాదేవీలు, నిధుల కదలికలపై నిశితంగా పరిశీలిస్తోంది.ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఇప్పటికే పలువురిని విచారించింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు ఇతర నిందితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డిలను ప్రశ్నించి వారి నుంచి కీలక వివరాలు సేకరించింది. దీనికి కొనసాగింపుగా గతంలో ఆగస్టు 21న హైదరాబాద్, కడప జిల్లాల్లోని ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భాగంగా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసంలో లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు రెండు లాకర్ల తాళాలు, కొన్ని కీలకమైన దస్త్రాలను కూడా అప్పట్లో సేకరించారు.గత సోదాల్లో లభించిన ఆధారాలు, ఇతర నిందితుల విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగానే తాజాగా అవినాష్ రెడ్డిని ప్రశ్నించాలని ఈడీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపు మార్గాలపై అవినాష్ రెడ్డి నుంచి వివరాలు రాబట్టే అవకాశం ఉంది. ఈ పరిణామంతో వివేకా హత్య కేసులో దర్యాప్తు మరోసారి కీలక దశకు చేరుకుంది.

## ముంబైలో పోటాపోటీ నిరసనలు.. సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ' ఆందోళన

ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు.వీరికి ప్రతిగా జెన్ నెక్ట్స్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు.
ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్ట్స్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్ట్స్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

## పరిశుభ్రత సామాజిక బాధ్యత.. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో పరిశుభ్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. వారి వైఖరి కారణంగానే కృష్ణా, గోదావరి నదులతో పాటు కాలువల్లోకి మురుగునీరు చేరి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. పర్యావరణంపై పడిన ఈ ప్రభావం వాతావరణ మార్పులకు కూడా దోహదపడిందని, ప్రస్తుతం రాష్ట్రం 53 శాతం వర్షపాత లోటును ఎదుర్కోవడానికి పారిశుద్ధ్య లోపాలు కూడా ఒక కారణమని ఆయన పేర్కొన్నారు.ప్రతి పౌరుడు స్వచ్ఛాంధ్రలో భాగస్వామి అయినప్పుడే స్వర్ణాంధ్ర లక్ష్యాలు నెరవేరతాయని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించిన గ్రామాలు, పట్టణాలు, వివిధ సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు

- మొదటి పేజి తరువాయి

కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు."రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే" అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్లను వైసీపీ అడ్డుకుంటోందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బొత్స మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపవద్దని హితవు పలికారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పంజాబ్ సరిహద్దులో ఇద్దరు చొరబాటుదారులు హతం

పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారుల ను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి.అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

## కండక్టర్‌గా సీఎం విజయ్..

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మరింత విస్తరించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నేడు 'వెట్రి పయనం' పేరుతో ఈ విస్తృత పథకాన్ని ఆయన ప్రారంభించారు. చెన్నైలోని కోయంబేడు బస్ టెర్మినస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా మహిళా ప్రయాణికులకు ఉచిత టికెట్లు అందజేసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఇప్పటివరకు సాధారణ సిటీ, టౌన్ బస్సులకే పరిమితమైన ఈ పథకాన్ని ఇప్పుడు మరిన్ని సర్వీసులకు వర్తింపజేశారు. దీని ప్రకారం, ఇకపై మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్ (ఎల్ఎస్ఎస్), డీలక్స్ బస్సుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. అలాగే 40 కిలోమీటర్లు దాటిన మొఫుసిల్ ఆర్డినరీ, కొండ ప్రాంతాల్లోని ఆర్డినరీ బస్సులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది.
ఈ విస్తరణతో రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ రవాణా సంస్థలకు చెందిన మొత్తం 12,692 బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇది మొత్తం బస్సుల్లో సుమారు 69 శాతం. ఈ పథకం ద్వారా ప్రతిరోజూ సుమారు 84.32 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని అంచనా వేస్తున్నారు.ఉద్యోగాలు, కళాశాలలు, ఇతర పనుల కోసం ప్రయాణించే మహిళల ఖర్చులను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీనికి ఎలాంటి ఆదాయ పరిమితి గానీ, ప్రయాణాలపై పరిమితి గానీ లేదు. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. అయితే, 'స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్' (ఎస్ఈటీసీ) బస్సులకు ఈ పథకం నుంచి మినహాయింపు ఇచ్చారు.

# ఐదు బుధ వారల జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన పథకానికి రూ.20,116 విరాళం

## ర్యాలి జగన్మోహిని కేశవ స్వామిని దర్శించుకున్న చెల్లూరు దంపతులు

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 2:** ఆధ్యాత్మిక విశ్వాసంతో ఆలయాలను సందర్శిస్తూ దైవ సేవలో భాగస్వాములు కావడం ద్వారా భక్తులు తమ వంతు సేవలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన చెల్లూరు శంకరరావు--నాగలక్ష్మి దంపతులు ర్యాలిలోని ఐదు బుధవారాల శ్రీ జగన్మోహిని కేశవ, గోపాలస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో కొనసాగుతున్న శ్రీ స్వామివారి అన్నదాన పథకానికి రూ.20,116 విరాళాన్ని దంపతులు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన భక్త దంపతులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ద్వారపురెడ్డి సురేష్‌బాబు దంపతులను స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు.అన్నదాన పథకానికి విరాళం అందించడం పట్ల ఆలయ నిర్వాహకులు దంపతులను అభినందించారు. స్వామివారి సేవా కార్యక్రమాలకు భక్తుల సహకారం మరింతగా అందాలని ఆకాంక్షించారు.




# జగ్గంపేటలో ఘనంగా మహాత్మా గాంధీ 157వ జయంతి



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబరు 2:** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాసవి మాత చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వేడుకలకు హాజరైన చిన్నారులు, విద్యార్థినీ విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ కొత్త కొండబాబు మాట్లాడుతూ సత్యం, అహింస, ధర్మం అనే ఆయుధాలతోనే దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీ. ఆయన చూపిన బాటలోనే నేటి యువత నడవాలి. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించినప్పుడే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే క్రమశిక్షణ, నిజాయితీని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి బంగార్రాజు, కంచర్ల శ్రీను, బొండా నూకబాబు, కొత్త రాము,బి.వీర సత్య, మాతం శెట్టి నారాయణ, వి నాగసత్య, వి శ్రీరామ్మూర్తి, మాతం శెట్టి లావణ్య, వి రాధాకృష్ణారావు, కంచర్ల బాబు, రమాదేవి ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్, వనిత క్లబ్బు సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 17వరోజుకు చేరిన వీఆర్ఎల సమ్మె




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబరు 2:** తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఎలు చేపడుతున్న సమ్మె శుక్రవారానికి 17వరోజుకు చేరింది. జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి వీఆర్ఎలు పూలమాలలు వేసి వినతిపత్రం ఇచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.10500 వేతనాలతో కుటుంబాలను పోషించలేకపోతున్నామని ఆవేదన చెందారు. పేస్కేల్ ఇవ్వాలని, నామినీలను రెగ్యులర్ చేయాలని, అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా వీఆర్ఎల సంఘం అధ్యక్షుడు సురేష్, ఇశ్రాయేలు, జగ్గంపేట మండల శాఖ అధ్యక్షుడు ఇస్సాకు, కార్యదర్శి మౌళి, ప్రభావతి, అప్పన్న, గోవిందు, వంశీ రత్నం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సంఘ భవనానికి స్థలం కేటాయింపు.

- ఆలమూరులో శ్రీకృష్ణుని ఆలయం సమీపంలో స్థలం
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు.





**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 02:** ఆలమూరు మండల సూర్య గాయత్రి బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి మండల కేంద్రమైన ఆలమూరులో శ్రీకృష్ణుని ఆలయం సమీపంలో స్థలం కేటాయింపు జరిగింది. సంఘ అభివృద్ధికి భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌ను, ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఈదల సత్తిబాబును, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు జరగడంతో బ్రాహ్మణ సంఘ సభ్యులకు శాశ్వత వేదిక అందుబాటులోకి రానుందని వారు తెలిపారు. భవిష్యత్తులో సంఘ సమావేశాలు, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను భవనంలో నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు, సహకరించిన కూటమి నాయకులకు సంఘ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూర్య గాయత్రి ఆలమూరు మండల బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి

**పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రం**



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 02:** అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. 2019 నుంచి వేతనాలు పెంచకపోవడంతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, వివిధ యాప్‌ల పేరుతో అంగన్వాడీ సిబ్బందిపై పనిభారం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. 2014 నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంగన్వాడీ సిబ్బంది వేతనాలను ఒక్క రూపాయి కూడా పెంచలేదని ఆరోపించారు. అంగన్వాడీ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.హెల్పర్ల పదోన్నతులకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసిన జీవో నంబర్ 5ను సవరించాలని, పెండింగ్‌లో ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. 1972 పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ చట్టం ప్రకారం, సర్వీసులో ఉండగా ఉద్యోగం మానేసిన లేదా మరణించిన సిబ్బందికి కూడా గ్రాట్యుటీ వర్తింపజేయాలని కోరారు.అలాగే నవచేతన, ఐవీఆర్ యాప్‌లను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రయాణ భత్యం (టీఏ) బిల్లులను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ. చంద్రావతి, ప్రాజెక్టు కోశాధికారి వై.వి. రాజేశ్వరి, జగదీశ్వరి, వెంకటలక్ష్మి, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# విలేజ్ హెల్త్ క్లినిక్, సీసీ రహదారులు ప్రారంభం





**రూ.77 లక్షలతో హెల్త్ క్లినిక్, సీసీ రహదారుల ప్రారంభం**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 2:** ముమ్మిడివరప్పాడు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో శుక్రవారం 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.గ్రామంలో రూ.37 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌తో పాటు రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పలు సీసీ రహదారులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కీలకంగా నిలుస్తాయని అన్నారు. స్థానికంగానే ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం కొంతవరకు తగ్గుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా నూతనంగా నిర్మించిన సీసీ రహదారులతో గ్రామంలోని అంతర్గత రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని తెలిపారు. గ్రామాల అవసరాలను గుర్తించి దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన ఆరోగ్యం, రహదారులు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చడమే గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# తేటగుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం





**ఇద్దరు మహిళలు మృతి**

**పెన్ పవర్ ప్రతినిధి, కాకినాడ (తుని) అక్టోబర్ 02:** తుని మండలం తేటగుంట గ్రామ సమీపంలోని జాతీయ రహదారి-16పై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కమ్మరి లక్ష్మి (55), ఆమె వదిన కమ్మరి రాజమణి (60)తో పాటు బోడియం ప్రమీల, తక్కువల చంద్రకళ, మేనక పద్మ, సింధే శారద తదితరులు అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం తలుపులమ్మ లోవ ఆలయానికి ఆటోలో బయలుదేరారు.ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో తేటగుంట సమీపానికి చేరుకోగానే అన్నవరం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళు_న్న ప్రవేట్ అంబులెన్స్ డ్రైవర్ చంద్రగిరి రాజేష్ అతివేగంగా, నిర్లక్ష్యంగా, హారన్ మోగించకుండా వాహనం నడుపుతూ ఆటోను వెనుక నుంచి ఢీకొనడంతో
ఆటో అదుపుతప్పి రోడ్డును దాటి పక్కనే ఉన్న గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కమ్మరి రాజమణి అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రులను తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.అయితే చికిత్స పొందుతూ సింధే శారద మృతి చెందింది.. ప్రమాదంలో కమ్మరి లక్ష్మి, బోడియం ప్రమీల, తక్కువల చంద్రకళ, మేనక పద్మ, ఆటో డ్రైవర్ పల్లెల నాగ సంతోష్ తదితరులు గాయపడ్డారు.ఈ ఘటనపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి కలెక్టర్ ఘన నివాళులు



**కాకినాడ పెన్ పవర్, అక్టోబర్ 2:** మహాత్మా గాంధీ జయంతి, దేశ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులు అర్పించారు.కలెక్టరేట్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ ప్రియా, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

# ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు






**కాకినాడ ,పెన్ పవర్ అక్టోబర్ 2:** పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో మహాత్మా గాంధీ 156వ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని ఇరువురు మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.కె. మెహర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు, వారి ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన పాత్ర, ఆయన పాటించిన సత్యం, అహింస వంటి సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అలాగే నైతిక విలువలకు, రాజకీయ ఉన్నత ప్రమాణాలకు ప్రాధాన్యతనిచ్చిన గొప్ప రాజనీతిజ్ఞుడిగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి సేవలందించారని కొనియాడారు.జువాలజీ విభాగాధిపతి బొల్లి బాబా మాట్లాడుతూ గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చూపిన మార్గంలో యువత నడవాలని, వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అకడమిక్ కోఆర్డినేటర్ ఎన్. చక్రవర్తి మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలు, విలువలు ప్రస్తుత సమాజంలో ఎంతో అవసరమని అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచారని, వివిధ పదవుల్లో దేశానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు.అడ్మిషన్ కన్వీనర్ డా.లక్ష్మణ్,సంస్కృత విభాగాధిపతి డా. బుజ్జి కార్యక్రమాన్ని నిర్వహించారు. డా. రమణ,కె.కృష్ణప్రసాద్,బి.బొల్లి బాబు,వివిధ విభాగాల అధిపతులు,బోధనేతర సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశయాలే భావితరాలకు మార్గదర్శకం



**మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 2:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు, పరిపాలనాధికారి వి. రామస్వరూప్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గాంధీజీ దేశ స్వాతంత్ర్య సాధనకు చేసిన సేవలను, సత్యం, అహింసా మార్గంలో సాగించిన ఉద్యమాన్ని అధికారులు స్మరించుకున్నారు. గాంధీజీ చూపిన మార్గం కేవలం స్వాతంత్ర్య పోరాటానికే పరిమితం కాకుండా సమాజంలో శాంతి, సోదరభావం, సమానత్వం నెలకొల్పేందుకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు పేర్కొన్నారు.గాంధీజీ ఆశయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు ఆయన కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వ విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు ఉపాధి హామీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీకి ఘన నివాళులర్పించారు.

## తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా చూడాలని గాంధీజీకి వీఆర్ఏల మొర.

**-17వ రోజు చేరుకున్న ప్రత్తిపాడు వీఆర్ఏల నిరవధిక దీక్ష.**





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,అక్టోబర్, 02:** తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ప్రత్తిపాడు వీఆర్ఏలు చేస్తున్న నిరవధిక దీక్ష శుక్రవారం 17వ రోజుకు చేరుకుంది. శుక్రవారం గాంధీ జయంతి కావడంతో వీఆర్ఏల సంఘ నాయకులు ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా గాంధీ వినతి పత్రం అందించి తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని గాంధీజీ విగ్రహానికి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా చాలీ చాలని జీతాలతో కుటుంబాలు గడుపుకు వస్తున్నామని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆకాశాన్నంటిన నిత్యవసర వస్తువుల ధరల వల్ల పస్తులతో గడుపుతున్నామన్నారు. పెరిగిన ధరల కనుగుణంగా పే స్కేలుతో పాటు, తమ న్యాయమైన కోరికలను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి కృష్ణ, మానూరు సత్తిబాబు,మురా గంగరాజు, వల్లూరి మోహన్ దాస్, వేమగిరి అభిలాష్, పెదపూడి కొండబాబు,బూరా తాతబ్బాయి, సానిపల్లి తాతారావు మండలంలోని పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాల బాటలో సమాజ సేవకు ప్రాధాన్యం





**కాకినాడ రూరల్, పెన్ పవర్,అక్టోబర్ 2:** మహాత్మా గాంధీ చూపిన సేవా మార్గం, సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పాటుపడాలనే ఆయన ఆశయాలు నేటి తరాలకు ఆదర్శమని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు పేర్కొన్నారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని పెనుమర్తి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ ఉత్సవంలో పిల్లి అనంత లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు చీరలు అందించి శాలువాలతో సత్కరించారు.చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు గర్భిణులకు చీరలు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం,ప్రాథమిక విద్యలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఈ వ్యవస్థను మరింత ఆధునికంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు.చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోషకాహారం,విద్య, ఆరోగ్య సేవలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు బాల సంజీవని, సంపూర్ణ పోషణ ప్లస్ వంటి కార్యక్రమాల ద్వారా పలు పౌష్టికాహార పదార్థాలను అందిస్తున్నట్లు వివరించారు.తల్లులు, చిన్నారుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధునిక విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఆటపాటలతో కూడిన బోధనతో పాటు డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు టీవీలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ వ్యవస్థలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా చూడాలని, చిన్నారుల పోషణ, ప్రాథమిక విద్య విషయంలో తల్లిదండ్రులు కూడా సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం బాల్యం నుంచే ప్రారంభం కావాలని అన్నారు.అంగన్‌వాడీ ఉత్సవం అనంతరం పెనుమర్తి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పిల్లి అనంత లక్ష్మి, సత్యనారాయణమూర్తి మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటిని సంరక్షించి చెట్లుగా ఎదిగేలా చూడాలని సూచించారు. భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను స్మరించుకోవడంతో పాటు మహిళలు, చిన్నారుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో తెలుగు యువత అధ్యక్షుడు పిల్లి రాధాకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ జంపన సందీప్, ఐ-టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకె వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షురాలు పెంకె వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా సూర్యోదయ సంస్థ ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ....



**శంఖవరం /రౌతులపూడి పెన్ పవర్ అక్టోబర్ 02 :-** గాంధీ జయంతిని పురస్కరించుకుని సూర్యోదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం రౌతులపూడి గ్రామం లో ప్రభుత్వ ప్రజా వైద్యశాలలో మానవ సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సంస్థ ప్రతినిధులు రోగులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాంధీజీ సేవా స్ఫూర్తితో అవసరమైన వారికి సహాయం చేస్తామని సూర్యోదయంసంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మాదన సుబ్బారావు సలాది వినోద్, పన్నీర్ రమేష్, నక్క లోవరాజు, రొంగల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## శిధిలావస్థకు చేరిన ఎస్సీ ఏరియా సీసీ రోడ్లు

**రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై గ్రామసభలో వినతి**



**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 2:**వెదిరేశ్వరంగ్రామంలోని ఎస్సీ ఏరియాలో సీసీ రహదారులు శిధిలావస్థకు చేరి, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీజయంతి సందర్భంగా గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో సామాజిక కార్యకర్త బడుగు సుబ్బాయమ్మ, పాము నాగరాజు, బడుగు మహిమారావు తదితరులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.చిన్నపాటి వర్షానికే రహదారులపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ విగ్రహం పరిసర ప్రాంతంలోని రోడ్లు, డ్రైనేజీ పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. గత పదేళ్లుగా ఎస్సీ ఏరియాలో తగిన మౌలిక వసతులు కల్పించలేదని, పలుమార్లు గ్రామసభల్లో వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి వి. సబితకు వినతిపత్రం అందజేసి, ప్రస్తుత గ్రామసభ తీర్మానంలో ఎస్సీ ఏరియా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను చేర్చి, త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.ఽ

## మంత్రి సుభాష్‌ను కలిసిన పి.గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి మోకా ఆనంద సాగర్



**రామచంద్రపురం, పెన్ పవర్,అక్టోబర్ 2:** పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఇటీవల నియమితులైన మోకా ఆనంద సాగర్ శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను రామచంద్రపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ఆనంద సాగర్‌ను అభినందించారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలపై చర్చించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నమ్మకంతో ఆనంద సాగర్‌కు పి.గన్నవరం నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారని మంత్రి సుభాష్ తెలిపారు.ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు.టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు,కార్యకర్తలతో సమన్వయం పెంచుకుని కూటమిని బలోపేతం చేయాలని కోరారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని కూటమి అభ్యర్థుల కోసం పనిచేయాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించారు.మంత్రి సూచనల మేరకు పార్టీ అభివృద్ధి, కూటమి బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని మోకా ఆనంద సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డొక్కా నాదబాబు, సంసాని పెద్దిరాజు, నిమ్మకాయల శేషు, ముల్లేటి శ్రీనివాస్, బోనం బాబులు, గుత్తుల రామకృష్ణ, మద్దాల రాజా, మోకా బాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

# రూ.5.33 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

- ఎంపీ సానా సతీష్ బాబు

**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 2:** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు రూ.5.33 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని అన్నారు. పేద కుటుంబాల కష్టాలను తన కుటుంబ సమస్యగా భావించి ప్రభుత్వం సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు చేరవేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని సానా సతీష్ బాబు తెలిపారు. సీఎంఎఫ్ ఆర్ ద్వారా అందిన ఆర్థిక సహాయానికి లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఎంపీ సానా సతీష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అరగేళ్ల శ్రీనివాసరావు (బున్నీ), మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట నవీన్, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, న్యూటన్ ఆనంద్, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జ్ మేక లక్ష్మణ్, ముమ్మడి వెంకటేశ్వర్లు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, అంకమ్మరెడ్డి రామనాయుడు, బొబ్బిలి గోవింద్, కామడి దశరథ్, దేవ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




# సత్యం, అహింసా మార్గాలు నేటి సమాజానికి ఆదర్శం

- అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 2:** స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ అనుసరించిన సత్యం,అహింస, శాంతి,సేవా మార్గాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చూపిన నాయకత్వం, త్యాగం, ప్రజాసేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. విద్యార్థులు గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత, క్రమశిక్షణ, సత్యనిష్ఠ, సామాజిక బాధ్యత వంటి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి. సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# 'సేవా మేరా యోగదాన్' మొక్కలు నాటే కార్యక్రమం



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 2:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా శుక్రవారం కాకినాడ టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద 'సేవా మేరా యోగదాన్' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వేప మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలు, పార్టీ నాయకులు సమాజానికి తమ వంతు సేవ అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడంతో పాటు రక్షణ కల్పించి, వాటి సంరక్షణ బాధ్యతను స్థానిక నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు,కాకినాడ సిటీ పరిశీలకులు,డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, టౌన్ పార్టీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

అలాగే టౌన్ ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, లేబర్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ గదుల సాయిబాబా, చిక్కాల అబ్బు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వమ్మి బాలాజీ, మెంటా రావు, చింతలపూడి రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అవార్డుకు జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎంపిక

పరిశుభ్రత, పచ్చదనం, వైద్య సేవలకు గుర్తింపు



**గండపల్లి,పెన్ పవర్, అక్టోబర్ 02:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గండేపల్లి మండలం జెడ్, రాజంపేట పంచాయతీ పరిధిలో గల జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక చేసినట్లు సూపర్డెంట్ ప్రణీత్ తెలిపారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఆసుపత్రిలో నిర్వహిస్తున్న పరిశుభ్రత కార్యక్రమాలు, ఆసుపత్రి ఆవరణలోని ఉద్యానవనం నిర్వహణ, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, వైద్య వ్యర్థాల నిర్వహణతో పాటు రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను పరిశీలించి ఈ ఎంపిక చేసినట్లు తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం, పచ్చదనం, బయోమెడికల్ వ్యర్థాల సమర్థ నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణనలోకి తీసుకుని జిల్లా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎంపికతో జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణకు గుర్తింపు లభించినట్లయింది. అవార్డును జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, మరియు రూరల్ ఎమ్మెల్యే కొండబాబు చేతుల మీదగా డాక్టర్ ప్రణీత్ అందుకున్నారు. ఆయనకు, వైద్య సిబ్బందికి, పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా ప్రణీత్ మాట్లాడుతూ అవార్డు అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అయితే మరింత బాధ్యత పెరిగింది అన్నారు.




# హిజ్ మినిస్ట్రీస్ ద్వారా మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 2:** జగ్గంపేటలో హిజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. హిజ్ మినిస్ట్రీస్ అధినేత పాస్టర్ సురేంద్ర కుమార్, నీలు ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో 40 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఈ విధంగా కుట్టు మిషన్లు అందిస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి మండల అధ్యక్షులు జీను మణిబాబు మాట్లాడుతూ హిజ్ మినిస్ట్రీస్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, ప్రతి ఏటా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తూ పేద మహిళలకు ఉపాధి చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పాస్టర్ సురేంద్ర కుమార్, నీలు చేస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు.

# మండలంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు





### చిన్నారుల గాంధీజీ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణ

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 02** గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలవ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి జయంతి వేడుకలు జరిపారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గాంధీజీ వేషధారణలు వేయించి, ఆయన జీవిత విశేషాలను గుర్తుచేశారు. చిన్న వయసు నుంచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం, మంచి విలువలు పెంపొందుతాయని అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు. చిన్నారులు గాంధీజీ వేషధారణలో సందడి చేయడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, అంగన్వాడి ఆయాలు, చిన్నారులు లబ్ధిదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ తో ప్రజల సమస్యల పరిష్కారం



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 2 :** స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిర్వహించి ప్రజల నుంచి నేరుగా వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పెన్షన్లు, ఇళ్ల పట్టాలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు ఆన్ స్పాట్ లో ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, క్యాంప్ ఆఫీసుకు వస్తే చాలు సమస్య నేరుగా తన దృష్టికి వస్తుందని, గత ప్రభుత్వంలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వంలో ప్రజలే సుప్రీం అని, ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా తనకు చెబితే పరిష్కారం చేయడం తన బాధ్యత అని, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను దశలవారీగా పూర్తి చేస్తామని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రశాంత వాతావరణలో ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



### –ఆపరేషన్ త్రిశూల్ అవగాహనా సదస్సులో డీఎస్పీ,ఏబీజీ తిలక్

**కిర్లంపూడి,పెన్ పవర్, అక్టోబర్, 02:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దాపురం డి.ఎస్.పి, ఏబిజి తిలక్ కోరారు. శుక్రవారం కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో పంచాయతీ ఎన్నికల అవగాహన సదస్సుతో పాటు ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ,జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్, జగ్గంపేట సీఐ,బి తిరుపతిరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని వేలంక రామాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి డీఎస్పీ ఏబీజీ తిలక్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ రాబోయే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, కక్షలు, విభేదాలకు తావులేకుండా సుహృద్భావ వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా గ్రామంలోని యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాలకు సంబంధించిన కార్యకలాపాలు కనిపిస్తే 1972కు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించి కూడా పోలీసు అధికారులు పలు విలువైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుయువత నఅధ్యక్షులు గండే కాశీ విశ్వనాథ్, ఇంటి చెల్లారావు, పోలీసు సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# జనార్ధనస్వామి ఆలయంలో అన్నదానానికి భోజనం ప్లేట్లు, గ్లాసులు ఇతర సామాగ్రి అందజేత

**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 02:**నవ జనార్ధన ఆలయాల్లో నాలుగవ క్షేత్రమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయంలో ప్రతీ శనివారం దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం జరుగుతున్న అన్నదానం నిమిత్తం గ్రామానికి చెందిన కీ.శే గెడ్డం మాణిక్యాంబ జ్ఞాపకార్ధం వారి కోడళ్లు భవాని, గీతాజ్యోతి రూ.25వేలతో స్టీలు ప్లేట్లు, గ్లాసులు, గరిటెలు మొదలైన వడ్డన సామాగ్రి శుక్రవారం అందజేశారు. దేవస్థానం చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, అర్చకులు అంగర భగవానాచార్యులు వారిని అభినందించారు. అన్ని దానాల్లో అన్నదానం ఉత్తమమైనదని, అన్నదానం నిమిత్తం భక్తులకు అవసరమైన సామాగ్రి అందించడం చాలా సంతోషంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తోరాట శివ, చల్లా ఉమా సతీష్ ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు



## ఆపరేషన్ త్రిశూల్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

-నైపుణ్య కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం.




**ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 02:** ఆపరేషన్ త్రిశూల్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు ఎస్ఐ, ఎస్ లక్ష్మికాంతం అన్నారు.ప్రత్తిపాడులోని సరయు ఫంక్షన్ హాల్‌లో నైపుణ్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఎస్సై,ఎస్ లక్ష్మీకాంతం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఆపరేషన్ త్రిశూల్ గురించి విద్యార్థులకు వివరించారు.మహిళల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నైపుణ్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ పంచాయతీ అవార్డు అందుకున్న గండేపల్లి పంచాయితీ కార్యదర్శి



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 0 2** :స్వచ్ఛ పంచాయతీ కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు గండేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పనింద్రకు స్వచ్ఛ పంచాయతీ అవార్డు లభించింది. ఈ అవార్డును కుడా చైర్మన్ తలాట సత్యం, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జిల్లా కలెక్టర్ హరిందిర ప్రసాద్, డీఎల్‌పీవో బాలమణి తదితరులు అందజేశారు.అవార్డు అందుకున్న కార్యదర్శి పనింద్రను గండేపల్లి ఎంపీడీవో హరికృష్ణ సత్య ప్రసాద్, ఏవో చందర్‌రావు, స్వర్ణ గ్రామ వార్డు ఇన్‌చార్జి శిరీషతో పాటు మండల కార్యాలయ సిబ్బంది అభినందించారు. తీలో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని వారు పేర్కొన్నారు.

## ఆలమూరు సిహెచ్‌సికి జిల్లా ఉత్తమ స్వచ్ఛ అవార్డ్



**సూపరిండెండెంట్ డాక్టర్ శివకుమార్**

**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 02:**మండల కేంద్రం ఆలమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రజా సేవలో జిల్లా ఉత్తమ స్వచ్ఛ అవార్డు దక్కించుకుంది. ఈ మేరకు గాంధీ జయంతి వేడుకలలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎంపీ గంటి హరీష్ మధుర్ చేతుల మీదుగా ఆలమూరు సిహెచ్సి మెడికల్ ఆఫీసర్ సూపరిండెంట్ డాక్టర్ ఎం. శివకుమార్ శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది సహాయ సహకారాలతోనే ఈ స్వచ్ఛ అవార్డు పొందగలిగామన్నారు. రాబోయే రోజులలో ప్రజా ఆరోగ్య సేవలలో సిబ్బంది మరింతగా రాణించేందుకు ఇటువంటి ప్రశంసలు, అవార్డులు దోహద పడతాయని అన్నారు. ఇటువంటి అవార్డులే ఉద్యోగ, వృత్తిలో వారి సేవలకు గుర్తింపుగా, చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. అలాగే సిహెచ్సిలో వైద్యులను, సిబ్బందిని అభినందిస్తూ, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రత్తిపాడు, రాచపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు స్వర్ణాంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు

-అవార్డులు అందచేసిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్.





**ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 02:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో రెండు ప్రభుత్వ ఆసుపత్రులకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు లభించాయి. పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తున్న ప్రత్తిపాడు వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. కాకినాడలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవార్డులను అందజేశారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాసుధ, ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ విద్యా స్రవంతి అవార్డులను స్వీకరించారు. ఆసుపత్రుల పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, వైద్య వ్యర్థాల సమర్థ నిర్వహణతో పాటు రోగులకు అందిస్తున్న సేవల్లో చూపిన పనితీరును పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డులు లభించినట్లు వైద్యాధికారులు గీతాసుధా, విద్యాస్రవంతి తెలిపారు.

## వీఆర్‌ఏల ధర్నా 17వ రోజుకు




**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 0 2:**వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం గండేపల్లి మండలంలో కొనసాగుతున్న ధర్నా శుక్రవారంతో 17వ రోజుకు చేరుకుంది. గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వీఆర్‌ఏలు మహాత్మా గాంధీ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వీఆర్‌ఏలకు పైస్థాయి వేతన స్కేలు అమలు చేయాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే నామినీ వీఆర్‌ఏలను కూడా వీఆర్‌ఏలుగా నియమించాలని కోరారు.తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిగణనలోకి తీసుకుని, సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని వీఆర్‌ఏలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అందరూ వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో రావులపాలెం ఘనత

- స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర అవార్డు ప్రదానం



**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 2:**గ్రామీణ పారిశుధ్య పరిరక్షణ, వ్యర్థాల సమర్థ నిర్వహణలో రావులపాలెం గ్రామపంచాయతీ ప్రదర్శించిన పనితీరుకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర అవార్డుకు రావులపాలెం పంచాయతీ ఎంపిక కాగా, గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి ఎల్. దుర్గాప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారిణి డి. శాంతలక్ష్మి పురస్కారాన్ని అందుకున్నారు.గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ వ్యవస్థను సమర్థంగా అమలు చేయడంతో పాటు తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని ప్రోత్సహించడం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలను అవార్డు ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నారు. ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన పెంపొందించేందుకు సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తూ స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించినట్లు అధికారులు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 12 గ్రామపంచాయతీలను స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర అవార్డులకు ఎంపిక చేయగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి రావులపాలెం పంచాయతీకి చోటు దక్కింది. రాష్ట్రస్థాయి పురస్కారం లభించడంతో పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

## గాంధీజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి.

-పిసిసి సభ్యులు ధరణాలకోట శ్రీను.



**కిర్లంపూడి/అక్టోబర్,పెన్ పవర్,అక్టోబర్,02:**గాంధీజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పి సి సి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను అన్నారు. మాజీ కేంద్ర మంత్రి మల్లిపూడి మంగపతి పల్లం రాజు ఆదేశాల మేరకు. జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానంద రావు పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రమైన ప్రత్తిపాడు ఏగులమ్మ గుడిసెంటర్ లో ఉన్న గాంధీ విగ్రహానికి. పిసిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో. జిల్లా కార్యదర్శి కొప్పన కోటేశ్వరరావు,కంది మళ్ల స్యామేలు,బొట్టా సూరిబాబు బత్తుల వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ ఎన్నికలకు ప్రచారం ప్రారంభించిన వైయస్సార్ శ్రేణులు.

- ముద్రగడ్డ గిరిబాబు ఆధ్వర్యంలో ఏలేశ్వరం 3వ వార్డులో ఇంటింటి ప్రచారం.





**ఏలేశ్వరం, పెన్ పవర్ ,అక్టోబర్ 2:** మున్సిపల్ ఎన్నికలకు పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించింది. పత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు మూడవ వార్డులో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గిరిబాబు ప్రతి ఇంటికి వెళ్లి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 28 వార్డుల్లో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచర కార్యక్రమంలో

వైసిపి సీనియర్ నాయకుడు శిడగం వెంకటేశ్వరరావు, వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి బదిరెడ్డి గోవిందు, అలమండ నాగేంద్ర, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, సఖి రెడ్డి బుజ్జి, సుంకర రాంబాబు, సామంతుల సూర్య కుమార్, దలే కిషోర్, జువ్వునవీర్రాజు, వాగు బలరాం,గొల్లపల్లి సురేష్, పైల విజయ్, రాచర్ల రమేష్, గొడుగు నాగేంద్ర, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవాలి.

- ప్రత్తిపాడు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శారదామణి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 02:** చనికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని మరలా అటువంటి తప్పులు చేయకుండా తమలో మార్పు రావాలని ప్రత్తిపాడు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శారదామని అన్నారు.గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక సబ్ జైలు గాంధీజీని స్మరించుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శారదామణి ఖైదీలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకొని మరల అటువంటి తప్పులు చేయకుండా ఉండాలని తెలియజేసారు.జడ్జీలు శిక్షలు వేసేది మీ మీద కోపంతో కాదని,మీరు పరివర్తన చెంది మీలో మార్పు తీసుకురావడం కోసం చట్టానుసారం శిక్షలు వేస్తారని వివరించారు.మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖైదీలకు మిఠాయిలు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్స్ బుగతా శివ,పిల్లి బాలరాముడు, సబ్ జైల్ సూపరిండెంట్ కళ్యాణ్ చక్రవర్తి సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ కి ఘన నివాళులు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు 2:**గాంధీ జయంతి సందర్భంగా అంబాజీపేట జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన అహింస, సత్యాగ్రహం, సత్యనిష్ఠ వంటి విలువలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు అభివృద్ధి కమిటి చైర్మన్ విళ్ల లోవరాజు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు గ్రంధి సాయిబాబు, కడించర్ల అర్జునుడు, అప్పన దత్తుడు, కాజా వీర్రాజు, గ్రంధి శ్రీను, పెదమల్లు గుప్త, గోకవరపు సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 2:** జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ సత్యం, అహింసా సిద్ధాంతాలను ఆయుధాలుగా చేసుకుని మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని తెలిపారు. సత్యం, అహింస, శాంతి, సహనం, నైతిక విలువలకు గాంధీజీ ఇచ్చిన ప్రాధాన్యత నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.లాల్ బహదూర్ శాస్త్రి సరళత, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని ఎస్పీ పేర్కొన్నారు. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ప్రజల్లో ధైర్యం, ఐక్యతను నింపుతూ "జై జవాన్--జై కిసాన్" నినాదాన్ని అందించారని, దేశ రక్షణలో సైనికులు, దేశాభివృద్ధిలో రైతుల పాత్రను చాటి చెప్పారని తెలిపారు. శాస్త్రి నిరాడంబర జీవనం,ఉన్నత నైతిక విలువలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమన్నారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళు లర్పించారు.

# 28 ఏళ్లుగా శీల గ్రామంలో గాంధీజీ జయంతి వేడుకలు



- శివకృష్ణకు మహాత్మునిపై ప్రత్యేక అభిమానం
- కూనపురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా గాంధీజీ జయంతి

**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 2:** జాతిపిత మహాత్మా గాంధీజీ పట్ల భక్తిశ్రద్ధలతో 28 ఏళ్లుగా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ గాంధీజీ ఆశయాలను భావితరాలకు పరిచయం చేస్తున్న కూనపు రెడ్డి శివకృష్ణకు శీల గ్రామంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. గాంధీజీ పట్ల తనకున్న అభిమానాన్ని సేవా కార్యక్రమాల రూపంలో కొనసాగిస్తున్న శివకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం శీల గ్రామంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని గాంధీజీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శివకృష్ణతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు పాల్గొని మహాత్మునికి నివాళు లర్పించారు. గాంధీజీ విగ్రహాన్ని శుభ్రపరిచి పూలమాలలు వేసి, దేశభక్తి గీతాలు ఆలపించారు. విద్యార్థులకు గాంధీజీ జీవితం, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర, సత్యం, అహింస వంటి ఆశయాల గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కూనపు రెడ్డి శివకృష్ణ మాట్లాడుతూ దాదాపు 28 సంవత్సరాలుగా ప్రతి ఏడాది గాంధీజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించడం తనకు బాధ్యతగా మారిందన్నారు. చిన్ననాటి నుంచే గాంధీజీపై తనకు ప్రత్యేక అభిమానం ఏర్పడిందని తెలిపారు.

తన చిన్నతనంలో గ్రామానికి చెందిన మాధవరపు బాసికాపు గాంధీజీ సేవలను గ్రామస్తులకు వివరిస్తూ జయంతి కార్యక్రమాలను నిర్వహించేవారని శివకృష్ణ గుర్తుచేశారు. గాంధీజీ విగ్రహం వద్ద విద్యార్థులతో పరిసరాలను శుభ్రం చేయించి, దేశభక్తి గీతాలు పాడిస్తూ దేశభక్తి, గాంధీజీ ఆశయాల గురించి వివరించేవారని, అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసేవారని తెలిపారు.

గ్రామంలో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన రెండో ఏడాదికే మాధవరపు బాసికాపు మృతి చెందారని, అప్పట్లో విద్యార్థుల్లో ఒకరిగా ఉన్న తాను ఆయన జ్ఞాపకాలను కొనసాగిస్తూ గాంధీజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం అలవాటుగా మార్చుకున్నానని శివకృష్ణ పేర్కొన్నారు. బాసికాపు చూపిన మార్గంలో గాంధీజీ ఆశయాలను భావితరాలకు తెలియజేయడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు.ప్రతి ఏడాది గాంధీజీ జయంతి సందర్భంగా గ్రామంలోని విద్యార్థులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, వారికి చిన్నపాటి ఉపన్యాసాల ద్వారా గాంధీజీ జీవిత విశేషాలను, సత్యం, అహింస, స్వచ్ఛత, దేశభక్తి వంటి విలువలను వివరించడం జరుగుతోందన్నారు.చిన్నారుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.గాంధీజీని కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాకుండా ఆయన ఆశయాలను జీవితంలో ఆచరించడమే నిజమైన నివాళి అని శివకృష్ణ పేర్కొన్నారు. గ్రామంలోని పెద్దలు, యువత, విద్యార్థులు కలిసి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో చిట్నీడి సత్తిరాజు, మాధవరపు నానాజీ, నల్లమిల్లి రామారెడ్డి, వాసిరెడ్డి శ్రీను, గరగ కొండలరావు, కోన బాబురావు, కోదండపాణి, వాసిరెడ్డి వీరబాబు, చిట్నీడి వెంకటరమణ, గుంటముక్కల వెంకటేశ్వరరావు, పేచేటి పాండురంగ, కోన బుజ్జి, కుంచనపల్లి సుబ్బయ్య, వాసిరెడ్డి నూకరాజు, కుంచనపల్లి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొని గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.

## బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్రలతో అడ్డుకుంటున్నారు: జ్యోతుల నవీన్ కుమార్



**కాకినాడ పెన్ పవర్,అక్టోబర్ 02 :**ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కకూడదనే కుట్రతోనే వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ధ్వజమెత్తారు. బడుగు బలహీనవర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో అసెంబ్లీలో బీసీలకు 34% రిజర్వేషన్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీవో నెం.105, 1065 జారీ చేస్తే.. వెంటనే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నది ఆ పార్టీ నేతలేనని ఆయన మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో ఎన్నికలు జరగకూడదని, ఒకవేళ జరిగినా బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే కుట్రతోనే వాళ్లు ఇలా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గత వైసీపీ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ ఇవ్వకపోవడం వల్ల ఏకంగా 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని, ఇప్పుడు కూడా వారికి ఆ పదవులు రాకూడదన్న కుట్రతోనే సిగ్గులేకుండా కోర్టుకు వెళ్లి మరీ అడ్డుకుంటున్నారని విమర్శించారు. ?బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తే ఎక్కడ వారి రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందో అన్న భయంతోనే న్యాయస్థానంలో పిటిషన్లు వేసి అడ్డుపడుతున్నారని, ఇది బీసీలకు చేస్తున్న తీరని ద్రోహమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేయాలనే అజెండాతోనే వారు ఈ విధంగా అడ్డుతగులుతున్నారని దుయ్యబట్టారు. ఒకపక్క ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు బీసీ రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు అహర్నిశలు కృషి చేస్తుంటే, గొడ్డలి పార్టీ నేతలు మాత్రం ఇలా కుట్రలు చేస్తూ అడ్డుపడుతున్నారని తెలిపారు. వెనుకబడిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగా చూడాలనే కుట్రతోనే ఇలా అడ్డుకునే నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఎంతమంది అడ్డుకున్నా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.ప్రత్యర్థులు ఎన్ని రకాలుగా అడ్డుకునే ప్రయత్నం చేసినా.. హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే, బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు. న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించి స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు కల్పించాలన్న తమ సంకల్పం నెరవేరే వరకు పోరాడుతామన్నారు. సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీల అభ్యున్నతి కోసం తాము ఇచ్చిన మాటపై ఎక్కడా వెనక్కి తగ్గబోమని తేల్చి చెప్పారు. నాలుగు దశాబ్దాల క్రితమే 1987లో 20%, 1995లో 34% రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర తమదని, బీసీల రాజకీయ సాధికారత అనేది టీడీపీ డీఎన్ఏ లోనే ఉందని నవీన్ కుమార్ ఉద్ఘాటించారు.

## ప్రత్తిపాడులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు.

-పలువురికి నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయం అందజేత.






**కిర్లంపూడి /ప్రత్తిపాడు, పెన్ పవర్, 02:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీజీ జయంతి వేడుకలుశుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు, ఇంజనీర్, బళ్ళ చంద్రమోహన్ పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం మహాత్ముని సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ సేవా కార్యక్రమం చేపట్టారు.

జేఎన్టీయూకే పూర్వ విద్యార్థి,యు.ఎస్.ఎ కి చెందిన సూర్యనారాయణ మెట్ట, ఎంటర్ప్రైజెస్ ఆర్కిటెక్ట్,ఆర్థిక సౌజన్యంతో, పుట్టుకతో అంధత్వం కలిగిన 35 సంవత్సరాల యువతికి,పుట్టుకతో శారీరక వైకల్యం గల 35 సంవత్సరాల యువకునికి పోషణ నిమిత్తం నిత్యవసర సరుకులతోపాటు వైద్య ఖర్చులకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. ధర్మవరం రఘురామ క్లాత్ షాప్ ҩ రఘురామ హాస్పిటల్స్ యజమానులు లయన్ ఏసుబాబు ఇద్దరికీ నూతన వస్త్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ చలంకూరి కృష్ణమూర్తి, సభ్యులు పంతం సూరిబాబు, ఏడిద రెడ్డి నాయుడు, పివిఎన్ రాజు ( అమరేంద్ర), కె సంజీవరావు, జి డేవిడ్ రాజు,పాల్గొని, గాంధీజీ చూపిన మార్గంలో నిరుపేదలకు, వికలాంగులకు అండగా ఉంటామని తెలిపారు.యు. ఎస్. ఎ,కు చెందిన దాత జేఎన్టీయూ పూర్వ విద్యార్థి, సూర్యనారాయణ మెట్ట,ఇంధన ఏసుబాబు, లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## టింబర్ అభివృద్ధికి మొక్కలు నాటుదాం -మండల టిడిపి అధ్యక్షుడు సత్తిబాబు, ఎంపీడీవో రాజు



**ఆలమూరు,పెన్ పవర్, అక్టోబర్ 02:**మొక్కలను నాటుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు టింబరు అభివృద్ధికి బాటలు వేద్దామని మండల టిడిపి అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, ఎంపీడీవో ఏ.రాజు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో విబిజిఆర్ఎంజి (ఉపాధి హామీ) పథకం కింద మంజూరైన వివిధ రకాలైన కలప, పండ్ల జాతి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నేతలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేసే అభివృద్ధి ఏదైనా పర్యావరణాన్ని కాపాడుకుంటూ విశాల పరచాలన్నారు. కాలుష్య నియంత్రణతో భవిష్యత్ తరాలకు పునాది వేసిన వారమవుతామన్నారు. పచ్చని ప్రకృతి ఒడిలో గ్రామాలను ఉంచేందుకు కృషి చేస్తున్న కూటమి నాయకుల సేవలపై వారు ఆనందం వ్యక్తం చేశారు. కొత్తదనం నిండిన సేవాధృక్పదాలతో, పర్యావరణ పరిరక్షణ ప్రేమికులుగా జీవిస్తూ భవిష్యత్ తరాలకు ఉపాధిని కల్పించే మొక్కలను ప్రతి ఒక్కరు నాటాలని వారంతా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు రామానుజుల శేషగిరిరావు, ఈదల నల్లబాబు, రావాడ సత్తిబాబు,కేతా రాంబాబు, చల్లా బాబి, తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com